నాకు ప్రత్యర్థులే లేరు !

గెలుపుపై ధీమాగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో ఏకచత్రంగా తన మెజార్టీని తానే అధిగమిస్తూ.. ప్రత్యర్థులను చిత్తుచేసి హ్యాట్రిక్ విజేతగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నిలిచారు. నాల్గోసారి అధికార బీఆర్ఎస్ పార్టీ ఆయనకే టికెట్‌ను కేటాయించిన విషయం తెలిసిందే. గత మూడు పర్యాయాలు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఆయన చేసిన కృషితో పాటు మరోసారి గెలిస్తే చేపట్టే కార్యక్రమాలను 'సాక్షి' అడిగి తెలుసుకుంది.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చా..

◆ గత ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికి తాగు నీటిని అందిస్తాననేదే నా ప్రధాన హామీ. అది ఇపుడు 99శాతం నెరవేరింది. నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల తీసుకుని వస్తానని ఇచ్చిన హామీని శంషాబాద్‌లో ప్రారభింపజేశామన్నారు.

◆ నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని బస్తీ దవాఖానాలు, ఏరియా ఆసుపత్రులతో దరి చేర్చాను.

◆ మణికొండలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు అనేక 33 కేవీ సబ్‌స్టేషన్లు, వందలాది అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను అధిగమించాం.

◆ ట్రాఫిక్‌కు అనుగుణంగా ఔటర్ సర్వీసు రోడ్డుతో పాటు అనేక రోడ్లను విస్తరించాం మరిన్ని రోడ్ల విస్తరణ పనులను ప్రారంభించాల్సి ఉంది.

◆ నార్సింగి, కోకాపేటలో ఔటర్ రింగ్ రోడ్డుపైకి ఎక్కే సౌకర్యాన్ని కల్పించాం. సర్వీసు రోడ్డు వెంట సైకిల్ ట్రాక్‌ను ఏర్పాటు చేశాం.

◆ రూ.22 కోట్లతో నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి, మొత్తం రూ. 1000 కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాం.



మణికొండలో పార్టీ కార్యాలయానికి వస్తున్న ఎమ్మెల్యే

చేయాల్సినవి మరిన్ని..

◆ పలు చోట్ల లింక్ రోడ్లను అభివృద్ధి చేసి ట్రాఫిక్ సమస్యను నివారించటంతో పాటు మూసీనదిపై ఐదుచోట్ల వంతెనలు, మూసీ సుందరీకరణను చేపడతాం. గండిపేట మండలంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 420 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, మణికొండలో మరో 2లక్షల లీటర్ల రిజర్వాయర్‌లను నిర్మిస్తాం. కోకాపేట, బుద్వేల్‌లలో ఐటీ సంస్థలు వచ్చేందుకు కృషిచేసి గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాలను మరో దుబాయ్, అమెరికాల మాదిరిగా అభివృద్ధి చేస్తాం.

దేశంలోనే మొదటి స్థానం..

◆ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందనే విషయం కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక సంస్థలు పేర్కొన్నాయి.

మెజార్టీకే ప్రయత్నం..

◆ గత మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా తాను చేపట్టిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో భారీ మెజార్టీతో గెలుస్తాననే నమ్మకం ఉంది. కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల అభ్యర్థుల స్వస్థలాల్లోనే గత రికార్డులను చెరిపేసే మెజార్టీలు సాధిస్తాననే నమ్మకం ఉంది. ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ తన పనితీరును ఇప్పటికే మెచ్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పొత్తులో భాగంగా ఈసారి రాజేంద్రనగర్‌లో అభ్యర్థిని పెట్టరనే భావిస్తున్నా. మణికొండ మున్సిపాలిటీ, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలోనూ మెజార్టీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

- ఆర్‌ఓ కార్యాలయం వద్ద మూడంచెల భద్రత
- అందుబాటులో నామినేషన్, అఫిడవిట్ పత్రాలు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం 52.. నామినేషన్ ప్రక్రియకు ఏర్పాటు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 3 నుంచి 10 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నామినేషన్ పత్రాలు, నమూనా అఫిడవిట్‌లు ఈసీఐ వెబ్‌సైట్లో లేదా ఆర్‌ఓ కార్యాలయంలో తీసుకోవచ్చన్నారు. ఎన్నికల నియమావళిని అభ్యర్థులు తప్పక పాటించాలన్నారు. కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, మూడంచెల భద్రత ఉంటుందన్నారు. అభ్యర్థితో పాటు మరో నలుగురు మాత్రమే రావొచ్చని, నవంబర్ 13న నామినేషన్ల ఉపసంహరణ, 15న విత్‌డ్రాలు ఉంటాయని తెలిపారు. నామినేషన్ వేసినప్పటి నుంచి అభ్యర్థి ఖర్చు వెలకట్టడం ప్రారంభమవుతుందని, రూ.40 లక్షల వరకు ఖర్చు చూపించాలన్నారు. అభ్యర్థులు చేపట్టే ప్రచారం, ర్యాలీలు, బహిరంగ సభలు తదితర కార్యక్రమాలపై షాడో టీమ్‌లు పర్యవేక్షణ చేసి ఖర్చును అంచనా వేస్తాయన్నారు. వాస్తవ ఖర్చును లెక్కిస్తుందని, రూ.40 లక్షలు దాటితే అభ్యర్థి డిస్‌క్వాలిఫై అవుతారని ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు కార్యాలయంలో ఆర్‌ఓ స్వీకరిస్తారన్నారు.

రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం..

అత్తాపూర్: నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుంచి 10 వరకు కొనసాగుతుందని రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య అన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు విధి విధానాలను పాటించాలన్నారు. ఈ మేరకు బుధవారం సాక్షితో ఎన్నికల నేపథ్యంలో నాయకులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఈనెల 13న నామినేషన్ల స్క్రూటీని ఉంటుందని, 15న అభ్యర్థులు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 30న పోలింగ్ జరుగుతుందని, డిసెంబర్ 3న కౌంటింగ్ బండ్లగూడలోని లార్డ్స్ కాలేజీలో జరుగుతుందని వివరించారు. నియోజకవర్గ పరిధిలో నూతన ఓటర్ల దరఖాస్తుల సంఖ్య అక్టోబర్ 31 నాటికి సుమారు 25 వేల వరకు ఉందన్నారు. 535 పోలింగ్ స్టేషన్ల సంఖ్య ఉండగా.. అవసరాలకు అనుగుణంగా మరో ఏడు పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశామన్నారు. కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు.

నామినేషన్ నిబంధనలివే...

◆ అభ్యర్థి పేరిట లేదా అభ్యర్థి, ఏజెంట్ జాయింట్‌గా కొత్తగా తీసుకున్న బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇవ్వాలి.

◆ కొత్తగా తీసుకున్న అకౌంట్ నుంచే ఖర్చుల లావాదేవీలు జరపాల్సి ఉంటుంది.

◆ నామినేషన్ ఫారం-2(బి), ఫారం-26 జత పర్చాలి.

◆ అభ్యర్థి వేరే నియోజకవర్గానికి చెందిన వారైతే సర్టిఫైడ్ ఎలక్ట్రోరల్ సర్టిఫైడ్ పత్రాలు జత పర్చాలి.

◆ ఎన్నికల కమిషన్ గుర్తించి, రిజిస్టర్డ్ అయిన జాతీయ, ప్రాంతీయ పార్టీల అభ్యర్థులకు ఒక ప్రతిపాదకుడు ఉంటే సరిపోతుంది.

◆ రిజిస్టర్ కాని, గుర్తింపు లేని ఇండిపెండెంట్ అభ్యర్థులకు 10 మంది ప్రతిపాదకులు అవసరం ఉంటుంది.

◆ అఫిడవిట్‌లో ఉన్న కాలమ్స్ తప్పని సరిగా పూరించాలి. ఏ కాలాన్ని ఖాళీగా వదలకూడదు. నోటరీ చేసిన అఫిడవిట్‌ను జత పర్చాలి.

◆ నామినేషన్ అభ్యర్థులు 2 సెం.మీ, 2.5 సెం.మీ లేటెస్ట్ ఫొటోలు అందజేయాలి.

◆ నామినేషన్ వేస ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తప్పనిసరిగా కుల ధృవీకరణ సర్టిఫికెట్ జతపర్చాలి.

◆ అభ్యర్థి జైలు శిక్ష అనుభవించినా, నేర నిరూపణ అయినా వివరాలను డిక్లేర్ చేయాలి.

◆ అభ్యర్థులు రూ.10 వేల నగదు మాత్రమే సెక్యూరిటీ డిపాజిట్‌గా ఆర్‌ఓ కార్యాలయంలో చెల్లించాలి.

◆ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల నగదు చెల్లిస్తే సరిపోతుంది.

◆ నామినేషన్ వేసిన అభ్యర్థి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదుట ప్రతిజ్ఞ చేయాల్సి ఉంటుంది.

◆ నామినేషన్ ప్రక్రియను ఫొటో, వీడియో తీస్తారు. విత్‌డ్రాలు ముగిసిన అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తారు.

ప్రతి గడపకు వెళ్లాల్సిందే !



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: దేశంలో ఏ రాష్ట్రంలో అమలుచేయని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మన రాష్ట్రం, నియోజకవర్గంలో జరిగాయని, వాటిని ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనతో పోటీపడుతున్న ఇతర పార్టీలకు చెప్పుకునేందుకే ఏమి లేదని, ×మనకు అన్ని విధాలా పార్టీ, ప్రభుత్వ అండదండలతో ప్రజలకు కావాల్సిన పనులన్నీ చేశామన్నారు₹. ప్రతి ఇంటికీ ఓ సంక్షేమ పథకం అందిందని, వాటిని గుర్తుచేసి ఓటు అడిగితే చాలన్నారు. – ఇప్పటి వరకు ఇచ్చిన సంక్షేమ పథకాలను మరింత పెంచడంతో పాటు మరిన్ని కొత్త పథకాలను ప్రకటించారని వాటిని ప్రతి ఓటరుకు వివరించాలన్నారు.

◆ హైదరాబాద్ నగరంతో పాటు మన నియోజకవర్గంలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని ప్రజలకు వివరించాలని, కార్యకర్తలకు సూచించారు.

◆ పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు ఎన్నికలు ముగియగానే మంచి గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు వసంతరావు, ఎ.నవీన్‌కుమార్, శైలజ, కావ్యశ్రీరాములు, యాలాల లావణ్య నరేష్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు సాతారాం, లక్ష్మణ్‌గౌడ్, బషీర్, నీలేష్ దూబేలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బండ్లగూడలో ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6,7వ డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో- ఆప్షన్ సభ్యులు, సీనియర్‌నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటికెళ్లి జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నవంబర్ 30న ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు పద్మావతిపాపయ్య, శ్రీలతసురేష్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, నాయకులు నాగరాజు, పాపయ్యయాదవ్, గోపాల్‌ముదిరాజ్, 6వ డివిజన్ ఇన్‌చార్జ్ సుమన్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, సుందర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరందుకున్న బీఆర్ఎస్ ప్రచారం

మణికొండ: నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ప్రచారం జోరందుకుంది. శంషాబాద్, బండ్లగూడ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఇటీవలే ప్రచారం ప్రారంభించిన నాయకులు, ప్రజాప్రతినిధులు మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నుంచి ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త తలారి మల్లేష్, ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో 2వ వార్డు చిత్రపురికాలనీ, నార్సింగి మున్సిపాలిటీల పరిధి 6వ వార్డులో వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన పథకాలను నిర్విరామంగా అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికే ప్రజల ఆదరణ ఉందని అభిప్రాయపడ్డారు. వచ్చే ఎన్నికల్లోనూ మరోసారి స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సీఎంగా కేసీఆర్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల బీఆర్ఎస్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఆర్. నర్సింహ, కౌన్సిలర్లు వసంతరావు, కావ్యశ్రీరాములు, శైలజ వినోద్, యాలాల లావణ్య నరేష్, పత్తి శ్రీకాంత్‌రావు, మహమూద్, నాయకులు లక్ష్మి శ్రీ,లతాగౌడ్, శ్రావణ్‌కుమార్, రూపారెడ్డి, బషీర్, నీలేష్ ప్రసాద్, బాల్‌రెడ్డి, శ్రీకాంత్, కుమార్, శివగంగ, కార్యకర్తలు పాల్గొన్నారు.



మణికొండ చిత్రపురిలో ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకులు

నాణ్యతలో తిరుగులేనిది భారతి సిమెంట్

తాపీ మేస్త్రీలకు ప్రమాదబీమా బాండ్లు

శంషాబాద్: సిమెంట్ నాణ్యతో భారతి సిమెంట్‌కు తిరుగులేదని, సంబంధిత వ్యాపారంలో భారతి సిమెంట్‌కు పోటీలేదని సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం శంషాబాద్ పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో తాపీ మేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. స్లాబుల్, పిల్లర్లు, బ్రిడ్జీలు, రహదారులకు భారతి సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందుతున్నారు. స్లాబ్ కాంక్రిట్ సమయంలో సైట్ వద్దనే నిపుణులైన ఇంజినీర్లు సూచనలు, సలహాలిస్తారన్నారు. మార్కెట్‌లో ఇతర సిమెంట్లతో పోలిస్తే అల్ట్రాఫాస్ట్ సిమెంట్ బస్తా ధర రూ. 20 అధికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 60 మంది తాపీమేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు.



తాపీ మేస్త్రీల సమావేశంలో భారతి సిమెంట్ ప్రతినిధులు

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

రాయదుర్గం: లైంగిక వేధింపులు లేని క్యాంపస్‌గా మనూ గుర్తింపు పొందేలా చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'సెన్సిటైజేషన్ అండ్ అవేర్‌నెస్‌పై వర్క్‌షాప్‌ను 'మనూ' అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) ఆధ్వర్యంలో పనిప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించేందుకు రెండురోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు పనిచేసే ప్రదేశాలలో ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేలా చూడాలన్నారు. మహిళల హక్కుల రక్షణ కోసం అమలు చేస్తున్న ప్రతి చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మై చాయిసెస్ ఫౌండేషన్ ప్రోగ్రామ్స్ హెడ్ డాక్టర్ ఫర్హానాబేగం, ఎంసీపీ కౌన్సిలింగ్ సెంటర్ సైకాలజిస్ట్ డాక్టర్ సుమన్‌రాయ్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొ.గుల్షిషాన్ హబీబ్, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ షకేరా పర్వీన్, డాక్టర్ షఫీక్ అహ్మద్, టి అరుంధతి, జే జ్యోతి ప్రసంగించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు

వ్యక్తి అదృశ్యం



కొర్ర రవి (ఫైల్)

శంషాబాద్ రూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎర్రకుంట తండా వాసి కొర్ర రవి (45)కి ఏడాది నుంచి మతిస్థిమితం సరిగ్గా లేదు. అతడు అప్పటి నుంచి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో గతనెల 30న సాయంత్రం సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: నిద్రమత్తులో భవనంపై నుంచి పడి కూలీ మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మహేష్ తిలక్‌చంద్ నందేశ్వర్ (38) గత కొన్ని నెలలుగా అశ్విన్, ధీరజ్‌తో కలిసి పెద్దగోల్కొండలోని మేస్త్రీ రాజు వద్ద కూలీ పనిచేస్తూ.. ఇక్కడే నివాసం ఉంటున్నారు. చిన్నగోల్కొండలో సత్తయ్య ఇంటి పనుల నిమిత్తం వీరు గతనెల 31న రాత్రి భవనంపై పడుకున్నారు. అర్ధరాత్రి నిద్రలేచిన నందేశ్వర్ భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి, తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టిగా పని చేయాలి

రాయదుర్గం: బీఆర్ఎస్ విజయం కోసం అందరూ సమిష్టిగా పనిచేయాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా సూచించారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఖాజాగూడలో గోపన్‌పల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లికి చెందిన మున్నప్ప, నర్సింహ, రాములు, మైసమ్మ, లక్ష్మీ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరగా సమావేశంలో నాయకులు రమేష్‌గౌడ్, జంగయ్యయాదవ్, రాజుముదిరాజ్, జగదీష్ పాల్గొన్నారు.

రూ.21.50 లక్షల స్వాధీనం

విజయనగర్‌కాలనీ: 3సీ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఆసిఫ్‌నగర్ కూడలిలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. జిన్సీచౌరాహి సాయిబాబ టెంపుల్ మంగళ్‌హాట్‌కు చెందిన నిఖిల్‌భంగ్(34) తన కారులో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లో రూ.21.50 లక్షల నగదు ఉన్నట్లు కనుగొన్నారు. నగదుకు సంబంధించిన ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం ఆసిఫ్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న రాకేష్

మణికొండ: సీబీఐటీ కళాశాల ఐటీ విభాగంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్. రాకేష్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. ఇమేజ్ ప్రోసెసింగ్ ఎడ్జ్ డిటెక్షన్, మూవింగ్ ఆబ్జెక్ట్ డిటెక్షన్ టెక్నిక్‌లను ఉపయోగించి ట్రాఫిక్ లైట్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాంద్రతను కనుగొనే కొత్త ఫ్రేమ్ వర్క్‌ను కనుగొన్నారు. లైవ్ ట్రాఫిక్ డెన్సిటీ విలువల ఆధారంగా ట్రాఫిక్ లైట్లను నియంత్రించవచ్చన్నారు. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ నాగరత్న పర్యవేక్షణలో తన పరిశోధన పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ సాధించిన రాకేష్‌ను సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఐటీ విభాగం హెచ్‌ఓడీ రజినీకాంత్‌లు ఆయనను బుధవారం అభినందించారు.

భూ వరాహస్వామికి ప్రత్యేక పూజలు

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత శ్రీ వెంకటేశ్వరస్వామి సముదాయంలో బుధవారం శ్రీ భూ వరాహస్వామి ద్వితీయ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, దీక్షాధారణ, మండపారాధన, స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, విశేష అలంకారం, ప్రధాన హోమాలు, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, తీర్థప్రసాదములు, అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. ఈ పూజల్లో దేవాలయ కమిటి ప్రధాన కార్యదర్శి సుభాష్, సుమతి, అధ్యక్షులు రఘుపతిరెడ్డి, నిర్మల, ఉపాధ్యక్షులు సుబ్బారాయు డులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సువర్ణతాపడ బంగారు ఆభరణాలను అలయ కమిటీ ప్రధానకార్యదర్శి టి.సుభాష్, సుమతిలు సమర్పించారు.

సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

గోల్కొండ: సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కార్వాన్ యాదవ సంఘం సమావేశం శ్రీ కృష్ణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సదర్ ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు యాదవ ఉత్సవాలకే తలమానికమని అన్నారు. గతంలో కంటే ఈ సంవత్సరం భారీ ఎత్తున ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని ఆయన అన్నారు. మల్లేష్, అనుయాదవ్, సందేశ్ యాదవ్, సుధాకర్‌యాదవ్, గోదా మధుసూదన్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ వీడ్కోలు



రాముడును సన్మానిస్తున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లో ఉప వ్యవసాయ సంచాలకులు (ఎఫ్‌టీసీ) కార్యాలయంలో నాల్గో తరగతి ఉద్యోగి డి.రాముడు పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను వ్యవసాయశాఖ నాల్గో తరగతి ఉద్యోగులు ఘనంగా శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. వేంకటేశ్వర్లు, ఆర్.ఎం. దివ్యజ్యోతి, నిర్మల, ఆదిలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ఆదిలాబాద్ అధ్యక్షులు గంగాధర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, అరుణ్‌కుమార్, కె.రామకృష్ణ, ఎండీ జావేద్, ఎండీ ఆరీఫ్, ఎం.శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్.యాదయ్య, నాల్గో తరగతి ఉద్యోగులు ఎం.కృష్ణ, జీ.ఎస్.శంకర్, శ్రావణ్‌కుమార్, మదన్ కుమార్, కె.అరుణ, లలిత, ఎండీ గౌస్, వెంకటేష్, ప్రతాప్ తదితరులున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఖండించాలి

గోల్కొండ: ఇజ్రాయెల్ కొన్ని ప్రపంచ అగ్రదేశాలతో కలిసి పాలస్తీన, గాజాపై చేస్తున్న సైనిక దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని ప్రముఖ ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా అన్నారు. బుధవారం గోల్కొండ రిసాలబజార్‌లో ఆయన పలువురు ఫుట్‌బాల్ క్రీడాకారులతో కలిసి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ ప్రధాని నేతన్యాహూ యుద్ధ ఉన్మాది అని ఆరోపించారు. గాజాలోని పాలస్తీన ప్రజలను మట్టుపెట్టడానికే ఆయన గాజాపై వైమానిక దాడులతో పాటు డ్రోన్‌లతో దాడులు చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్, యాకూబ్ అబీబ్, మహ్మద్ తదితరులున్నారు.



ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు

మతతత్వ శక్తులను ఓడించాలి



మాట్లాడుతున్న అమర్‌సింగ్

గోల్కొండ: మతతత్వ శక్తులు, పార్టీలకు బొందపెట్టాలని కార్వాన్ బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, ముస్లిం మైనార్టీలను మాయమాటలతో మోసం చేస్తూ పబ్బంగడుపుకుంటున్న మజ్లిస్ పార్టీకి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం నేర్పడం ఖాయమని అన్నారు. హైదరాబాద్ నగరం ఆధునీక నగరంగా మారిందని అయితే పాతనగరంలో ఒకసారి పర్యటించి చూస్తే ఆ పార్టీ పాతనగరానికి చేసిందేమి లేదన్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఏదేమైనా తెలంగాణలో ఈసారి భారీ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ పరిశీలకుడు నందకుమార్‌యాదవ్, డిజ్వర్‌సింగ్, ఆకుల గోవర్ధన్, ఇంద్రసేనారెడ్డి, సచిన్‌కామ్లెకర్, జగత్‌సింగ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ గెలుపు చారిత్రక అవసరం



నరేందర్‌కు మద్దతు తెలిపిన ఖానాపూర్ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రజల పోరాటానికి విలువ ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి రుణం తీర్చుకోవడంతో పాటు చారిత్రక అవసరమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, సీపీఐ పార్టీ జిల్లా నాయకులు మల్లేష్‌ల ఆధ్వర్యంలో పార్టీల నాయకులు ఆయనను పుప్పాల్‌గూడలో కలిసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ఒక్క జల ప్రాజెక్టు ఇప్పటి వరకు చెక్కు చెదరలేదని, అదే బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం, అన్నారం లక్ష్మీబ్యారేజీలు కుంగిపోవడం వారి పనితీరుకు నిదర్శనమన్నారు. లక్షలకోట్ల అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ చేపట్టి అవినీతికి పాల్పడిన వారి నుంచి రాబడతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి స్కీములోను స్కాములే ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజల తెలంగాణ వస్తుందని, ప్రజల కోరిక మేరకు పాలన ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఖానాపూర్ మాజీ సర్పంచ్ గంగయ్య, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కిషన్, శివరాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయండి !

రాజేంద్రనగర్: సీఎం కేసీఆర్ బంధువులమని తమ ప్లాట్లను లాక్కొని విల్లాలు నిర్మిస్తున్నారని, తమకు న్యాయం జరగకపోతే ఈ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి 200 మంది బాధితులతో నామినేషన్లు వేయించి తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని హ్యాపీహోమ్స్ సాగర్‌హిల్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. తమకు న్యాయం చేయాలంటూ.. బుధవారం నిర్మిస్తున్న విల్లాల వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, మధు, రాజేంద్రనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై మౌనిక, ఏఎస్సై శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పలువురు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తమకు న్యాయం చేయకపోతే 200 మంది బాధితులతో రాజేంద్రనగర్‌లో నామినేషన్లు వేస్తామని హెచ్చరించారు. నిరసనకు దిగిన వారిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

